# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం అమరావతి నిర్మాణ పనులు సహా పలు అంశాలపై చర్చిస్తోంది.**

2. **2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు.**

**3.** **కుల వృత్తుల వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆదరణ పథకాన్ని అమలు చేస్తున్నామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.**

**4.** **రాష్ట్రంలోని మైనారిటీలు ఆర్థిక సాధికారత సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నామని ఆ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో రాజధాని అమరావతి నిర్మాణ పనులపై చర్చిస్తున్నారు. రాజధానిలో నిర్మాణాలు, ఆ పనులకు సంబంధించిన అనుమతులపై ఈ సమావేశంలో మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశముందని అధికారులు తెలిపారు. అలాగే ఈ నెల 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగాదినోత్సవ ఏర్పాట్లు, రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో ఈరోజు నిర్వహించిన "11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం – సంకల్పంతో సాకారం" కార్యశాల కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ..31 సెకన్లు

-------------------------

కుల వృత్తుల వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆదరణ పథకాన్ని అమలు చేస్తున్నామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ జిల్లాల అధికారులతో

మంత్రి నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మూడో విడత ఆదరణ పథకం కింద కుల వృత్తి వృత్తుదారులకు అధునాతన పరికరాలు అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత టైలరింగ్ శిక్షణతో కుట్టు మిషన్లు అందజేస్తోందని మంత్రి వివరించారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21వ తేదీ వరకు యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొని యోగాసనాలు వేశారు. తిరుపతి జిల్లాలోని చంద్రగిరి కోట వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పాల్గొని .. మాట్లాడుతూ..

..వాయిస్...35 సెకన్లు

---------------------------

గాన గంధర్వుడు ఎస్.పీ.బాలసుబ్రహ్మణ్యం జయంతి ఈరోజు... తెలుగుతో పాటు దక్షిణాది చలన చిత్ర ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం 1946 జూన్ 4వ తేదీన అప్పటి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని కోనేటమ్మపేట గ్రామంలో జన్మించారు. తమిళ, కన్నడ, మలయాళ, హిందీ తదితర భాషల్లో వేలాది పాటలు పాడారు. 40 వేలకు పైగా పాటలు అనేక భాషల్లో ప్రపంచంలోనే ఒక అరుదయిన రికార్డు ఆయన సొంతం చేసుకున్నారు. ఉత్తమ గాయకుడిగా ఆరుసార్లు జాతీయ అవార్డు.. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ... పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నారు. ఆయన మరణానంతరం కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో గౌరవించింది. తన అమృత గానంతో దశాబ్దాల పాటు ప్రజలను రంజింపజేసిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 2020 సెప్టెంబర్ 25న 74ఏళ్ల వయసులో దివంగతులయ్యారు.

ఆయన జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు.

---------------------------

వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించుకోవడంపై రైతులకు అవగాహన కలిగిస్తున్నామని భారత వరి పరిశోధనా సంస్థ అధికారి లక్ష్మీ ప్రసూన అన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సౌత్ మోపూరు గ్రామంలో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో వ్యవసాయంలో వ్యయం, ఆర్థిక ప్రణాళిక అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంలో నూతన సాంకేతికతను వినియోగించడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చని ఆమె చెబుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని మైనారిటీలు ఆర్థిక సాధికారత సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు ఆ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ

ఉన్నతాధికారులతో  కేంద్ర పథకాలపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ, ఉపకారవేతనాలు, పీఎం వికాస్,  ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం, జాతీయ మైనారిటీల అభివృద్ధి ఆర్థిక సంస్థ– ఎన్ ఎండిఎఫ్ సి వంటి పథకాల ద్వారా వృత్తి నైపుణ్య అభివృద్ధితో పాటు  ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

-----------------------------

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు  మెరుగైన సేవలు అందించాలని  పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయ చంద్ర వైద్య సిబ్బందికి సూచించారు. పార్వతీపురంలోని జిల్లా  ఆసుపత్రిని  ఆయన ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు.వైద్యులతో మాట్లాడి రోగులకు అందిస్తున్న సేవలు, మందుల లభ్యతపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో మరిన్ని వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని వీటిని  ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.

-----------------------------

తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే యాత్రికుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తోందని  ఇండియన్ రైల్వే కాటరింగ్ అండ్ టూరిజం కార్పోరేషన్–ఐఆర్సిటిసి  అధికారి సంఘమిత్ర రౌళ్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస రైల్వే స్టేషన్‌లో ఆమె ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, శ్రీలంక రామాయణ యాత్ర కోసం విమాన ప్యాకేజీతో విశాఖపట్నం నుండి విమాన సర్వీసులను నడుపుతున్నట్లు చెప్పారు.

-----------------------------

దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశలో గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండురోజులపాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి పేర్కొంటూ...

వాయిస్...25  సెకన్లు

======================